టీజీఐఐసీ నిర్లక్ష్యంతో అమాయకులు బలి!

- పరిశ్రమలకు సేకరించిన భూములను విక్రయిస్తున్న పట్టాదార్లు
- పరిహారం చెల్లించినా తమపేర రిజిస్ట్రేషన్ చేయించుకోని టీజీఐఐసీ
- రికార్డుల్లో ఇంకా పట్టాదార్ల పేర్లు.. మోసపోతున్న ప్రజలు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఐఐసీ) నిర్లక్ష్యం కొందరు అమాయకులకు శాపంగా మారుతున్నది. ఏండ్ల క్రితం పరిశ్రమల కోసం సేకరించిన భూములను కూడా టీజీఐఐసీ తన పేర మ్యుటేషన్ చేయించుకోకపోవటంతో నష్టపరిహారం తీసుకున్న పట్టాదార్లు తమ భూములను అమాయకులకు అంటగడుతున్నారు. భూములు కొనుగోలు చేసినవారు వాస్తవం తెలిసిన తర్వాత లబోదిబోమంటున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు లెక్కలేనన్ని ఉండొచ్చని అధికారులే అంగీకరిస్తున్నారు. పారిశ్రామిక అవసరాల కోసం రైతుల నుంచి భూములు సేకరించి, మౌలిక సదుపాయాలు కల్పించిన అనంతరం పరిశ్రమలకు విక్రయించడం టీజీఐఐసీ బాధ్యత. రైతుల నుంచి సేకరించిన భూములను నష్టపరిహారం చెల్లించిన వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలా చేయడంవల్ల పట్టాదార్లు ఇతరులకు విక్రయించే అవకాశం ఉండదు. అయితే టీజీఐఐసీకి చెందిన అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలా ప్రాంతాల్లో సేకరించిన భూములు ఇంకా పట్టాదార్ల పేర్లతోనే కొనసాగుతుండటంతో వారు క్రయవిక్రయాలు జరుపుతున్నారు. దీనివల్ల కొనుగోలు చేస్తున్న అమాయకులు మోసపోతున్నారు. ఉదాహరణకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో వివిధ సర్వే నంబర్లలో దాదాపు 20 ఏండ్ల క్రితం అప్పటి ఏపీఐఐసీ సుమారు 200 ఎకరాల భూములు సేకరించింది. అందులో పావువంతు భూముల్లోనే పరిశ్రమలు ఏర్పాటు కాగా, మిగిలిన భూములు ఖాళీగానే ఉన్నాయి. భూములు సేకరించినా వాటిని పరిశ్రమల పేరుతో గానీ, ఏపీఐఐసీ పేరుతోగానీ రిజిస్ట్రేషన్ చేయించలేదు. దీంతో ఇంకా ఆ భూములు పట్టాదార్ల పేరు మీదే ఉన్నట్టు రికార్డులు చెప్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు వాటిని మళ్లీ ఇతరులకు విక్రయించారు.

చేతులెత్తేసిన టీజీఐఐసీ

సర్వే నంబరు 81 పరిధిలో ఇటువంటి ఘటన ఒకటి తాజాగా వెలుగు చూసింది. 20 ఏండ్ల క్రితం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఆరు ఎకరాల భూమి ఇప్పటికే నలుగురు చేతులు మారింది. తీరా ఐదో వ్యక్తి దాన్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా, టీజీఐఐసీ పేర రిజిస్టర్ అయినట్టు రికార్డులు చూపుతున్నాయి. దీంతో విక్రయానికి ఉంచిన ఆ నాలుగో వ్యక్తి తాను మోసపోయానని లబోదిబోమంటున్నాడు. తాను పట్టాదారు వద్ద భూమి కొనుగోలు చేసినట్టు, తన భూమిని విక్రయించేందుకు ఎన్వోసీ ఇవ్వాలని బాధితుడు టీజీఐఐసీని వేడుకొంటున్నాడు. అధికారులు మాత్రం ఎన్వోసీ ఇచ్చే ఆస్కారం లేదని చేతులెత్తేశారు. ఆ 200 ఎకరాల భూముల్లో ఇలాంటి ఇంకా ఎన్ని ఉన్నాయో తేలాల్సి ఉన్నది.

స్థానికంగా విచారించుకొని కొనుగోలు చేయాలి: టీజీఐఐసీ

పారిశ్రామిక ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేయాలనుకొనేవారు సమగ్రంగా విచారించుకొని, స్థానికులతో మాట్లాడిన తర్వాతే భూములు కొనుగోలు చేయాలని టీజీఐఐసీ అధికారులు సూచిస్తున్నారు. సిబ్బంది కొరత వల్ల తాము సేకరిస్తున్న భూములను వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతున్నామని, దీన్ని ఆసరాగా చేసుకొని పట్టాదార్లు నష్టపరిహారం తీసుకొని కూడా ఇతరులకు విక్రయించుకొంటున్నట్టు తెలిసిందని చెప్తున్నారు. సేకరించిన భూములను టీజీఐఐసీ పేర మ్యూటేషన్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూశాఖపై ఉంటుందని, వాళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాము చేసేదేమీ లేదని స్పష్టంచేస్తున్నారు. మొత్తంగా అధికారుల నిర్లక్ష్యం వల్ల అమాయకులు ఎంతోమంది మోసపోతున్నారు.

అమూల్ టర్నోవర్ 59,445 కోట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: అమూల్ పేరుతో పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్(జీసీఎంఎంఎఫ్) అంచనాలకు మించి రాణిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.59,445 కోట్ల(7 బిలియన్ డాలర్లు) ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఎనిమిది శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు 50వ వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశం అనంతం వెల్లడించింది. అలాగే గ్రూపు టర్నోవర్ రూ.80 వేల కోట్లు(10 బిలియన్ డాలర్లు)గా నమోదైందని తెలిపింది. 2022-23 ఏడాదికిగాను 72 వేల కోట్లు(9 బిలియన్ డాలర్లు) ఆర్జించింది. ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార బ్రాండ్, బలమైన పాల ఉత్పత్తుల బ్రాండ్‌గా అమూల్ ఎదిగింది. రైతులే యజమానిగా ఎదిగిన అమూల్ కో-ఆపరేటివ్ సొసైటీలో 36 లక్షల మంది రైతుల నుంచి రోజుకు 300 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నది. ఈ సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ శామల్‌భాయ్ పటేల్ మాట్లాడుతూ..జీసీఎంఎంఎఫ్ మరో చారిత్రక మైలురాయికి చేరుకున్నదని, ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార పదార్థాల బ్రాండ్‌గా అవతరించిందన్నారు.

బీఎస్ఎన్ఎల్

సరికొత్త ప్లాన్

60 రోజుల వ్యాలిడిటీతో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరో ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 60 రోజుల కాలపరిమితితో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్‌ను తెచ్చింది. ఈ ప్లాన్ కింద రోజుకు 1జీబీ డాటాతోపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. 4జీ సేవలు అందించడానికి సిద్ధమతున్న సంస్థకు ఈ నూతన ప్లాన్‌తో కస్టమర్లకు అధిక ప్రయోజనాలు లభించనున్నాయని తెలిపింది. ఇతర టెలికం సంస్థల కంటే బీఎస్ఎన్ఎల్ టారిఫ్‌లు చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఇరు సంస్థల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ విలీనం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నది. ఈ విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ వాటాదారులకు రూ.10 ముఖ విలువ కలిగిన 100 ఈక్విటీ షేర్లకుగాను ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌నకు చెందిన 155 ఈక్విటీ షేర్లు లభించనున్నాయి.

నూతన కార్ల సందడే..సందడి

వచ్చే నెలలో విడుదలకానున్న ఐదు మాడళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రస్తుత పండుగ సీజన్‌లో కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు సరికొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. ఇప్పటికే ప్రతి నెలలో అర డజన్‌కు పైగా మాడళ్లను విడుదల చేస్తున్న సంస్థలు..వచ్చే నెల లోనూ ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తూ ఐదు మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. వీటిలో కియా, నిస్సాన్, బీవైడీ, మెర్సిడెజ్ బెంజ్‌లు ఉన్నాయి. ఈ వివరాలు..

కియా నుంచి రెండు మాడళ్లు

కొరియాకు చెందిన వాహన సంస్థ కియా.. దేశీయ మార్కెట్లోకి నయా కార్నివాల్‌ను విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 3న మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఈ కారు ధర రూ.50 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. 2.2 లీటర్ 4-సిలిండర్ డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు 193 బీహెచ్‌పీల శక్తినివ్వనున్నది. దీంతోపాటు మరో ఈవీ మాడల్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 99.8 కిలోవాట్ల బ్యాటరీతో తయారు చేసిన ఈవీ 9లో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 561 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. కేవలం 24 నిమిషాల్లోనే 10 శాతం నుంచి 80 శాతం వరకు చార్జింగ్‌కానున్నది.

నిస్సాన్ మ్యాగ్నైట్ ఫేసిలిఫ్ట్

వచ్చే నెల 4న మ్యాగ్నైట్ ఫేసిలిఫ్ట్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది నిస్సాన్ ఇండియా. దేశీయ మార్కెట్‌తోపాటు ఇతర దేశాలకు అనుగుణంగా లెఫ్ట్-హ్యాండ్ డ్రైవ్ వెర్షన్ కూడా తీసుకురాబోతున్నది.

బీవైడీ ఈమ్యాక్స్ 7

చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ మరో మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 8న ఈమ్యాక్స్ 7 మాడల్‌ను అందుబాటులోకి తెస్తున్నది. అడాప్ సూట్, ప్రీమియం స్విచ్ గేర్, సాఫ్ట్-టచ్ మెటిరీయల్స్, లగ్జరీ లుక్‌తో తీర్చిదిద్దింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారులో 55.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 420 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ఇవ్వనున్నది.

మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్

జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్ ఎల్‌డబ్ల్యూబీ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 14.4 ఇంచుల సెంట్రల్ టచ్‌స్క్రీన్‌తోపాటు 12.3 ఇంచుల ప్యాసింజర్ టచ్‌స్క్రీన్, 4డీ సరౌండింగ్ సౌండ్ సిస్టమ్ కలిగిన ఈ మాడల్‌ను 2.0 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారు చేసింది.

ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ ఆఫర్లు

ముంబై, సెప్టెంబర్ 28: ఇటీవల మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నది. ఐఫోన్ 16ని కొనుగోలు చేసినవారికి రూ.5 వేల ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్ అందుకోవచ్చునని తెలిపింది. అలాగే ఈఎంఐ ఆప్షన్‌లో నెలకు రూ.2,497 చెల్లించి ఈ ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చునని సూచించింది. ఈ ఆఫర్లు డిసెంబర్ 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. పాత ఐఫోన్ కలిగివున్నవారు అప్‌గ్రేడ్‌తో ఐఫోన్ 16ని కొనుగోలు చేసిన వారికి క్యాష్‌బ్యాక్‌తోపాటు వడ్డీ రహిత ఈఎంఐని ఎంచుకోవచ్చునని సూచించింది. ఈ ఆఫర్ కేవలం ఐఫోన్ 16 ప్రొ మ్యాక్స్, ఐఫోన్ 16 ప్రొ, ఐఫోన్ 16 ప్లస్, ఐఫోన్ 16 మాడళ్లకు వర్తించనున్నది. ఈ-కామర్స్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లతోపాటు ఆఫ్‌లైన్ స్టోర్లు అప్‌ట్రానిక్స్, యూనికార్న్, క్రోమా, రిలయన్స్, విజయ సేల్స్, సంగీత మొబైల్స్‌లో లభించనున్నది.

రియల్టీ సంస్థలపై రెరా కొరడా

వెయ్యికిపైగా ప్రాజెక్టులపై రూ.35 కోట్ల జరిమానా

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై రెరా కొరడా ఝుళిపించింది. మార్కెటింగ్ కార్యకలాపాలు, ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలపై ఉక్కుపాదం మోపడానికి రెరా పలు కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పూర్తిస్థాయిలో రెరా ఏర్పాటైన గడిచిన ఏడేండ్లలో ఏకంగా వెయ్యికి పైగా ప్రాజెక్టులపై రూ.36 కోట్ల వరకు జరిమానా విధించింది. వీటిలో ఇప్పటికే రూ.15 కోట్లను ఆయా సంస్థలు చెల్లించాయి కూడా. ఎనిమిది కంటే ఎక్కువ ప్లాట్లను విక్రయించిన, 600 గజాలు అంతకంటే ఎక్కువ స్థలంలో నిర్మించి విక్రయాలు చేసినా ప్రాజెక్టులు రెరా పరిధిలోకి వస్తాయి. ఇలాంటి సంస్థలు తప్పకుండా రెరా వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ రెరా వద్ద నమోదు చేసుకోకుండానే విక్రయాలు జరిపితే ఆయా ప్రాజెక్టులు చేపట్టిన సంస్థలపై ఈ మండలి భారీస్థాయిలో జరిమానా విధిస్తున్నది.

రెరా ఏర్పాటైన తరువాత వివిధ ప్రాజెక్టులకు విధించిన జరిమానాలు

సంవత్సరం	ఫైన్ వేసిన ప్రాజెక్టులు	జరిమానా మొత్తం (రూ.కోట్లలో)
2018-19	335	3.06
2019-20	49	0.79
2020-21	04	0.29
2021-22	03	0.23
2022-23	180	1.70
2023-24	311	26.69
2024-25	131	2.96
మొత్తం	**1013**	**35.72**

రెరా నంబర్ లేకుండానే ప్రకటనలు..

రెరా నంబర్ లేకుండానే రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ స్థాయిలో వాణిజ్య ప్రకటనలు జారీ చేసిన సంస్థలపై ఫిర్యాదులు అందడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వాణిజ్య ప్రకటనలపై ఖచ్చితంగా రెరా నంబర్ ఉండాల్సిందేనని షరతు విధించింది. దీంతో తమ ప్రకటనల పక్కన రెరా నంబర్‌ను ఖచ్చితంగా ముద్రిస్తున్నాయి. ప్రీలాంచ్ ఆఫర్లు, ముందస్తుగా ఒప్పందం చేసుకున్న మేరకు ప్లాట్లను అప్పగించకపోవడం, వాటిలో సరైన వసతులు కల్పించకపోయిన ప్రాజెక్టులపై కూడా చర్యలు తీసుకున్నది. ఒక దగ్గర ప్రాజెక్టు నమోదు చేసుకొని..అదే అనుమతితో మరికొన్ని చోట్ల విక్రయాలు చేస్తున్న ప్రాజెక్టులను గుర్తించడానికి ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల ధర్నా

నస్పూర్, సెప్టెంబర్ 28 : కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వారికి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నాలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, నాయకులు ప్రకాశ్, రాజన్న, రాజేశ్వరి, మహేందర్, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కాగజ్‌నగర్‌సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

వరదల్లో రక్షణ చర్యలపై అవగాహన ఉండాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 28: భారీ వర్షాల కారణంగా ఏర్పడే వరద ప్రమాదాలలో ప్రాణ రక్షణకై చేపట్టాల్సిన చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని కోసి గ్రామా సమీపంలోని ప్రాజెక్టు వద్ద ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు వరదలో చిక్కుకున్న వారిని రక్షించే అంశాలపై శిక్షణ నిర్వహించారు. నీటిలో, వరద ప్రవాహంలో చిక్కుకున్న వారిని రక్షించే పద్ధతులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో రమేశ్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేందర్, గ్రామస్తులు ఉన్నారు.

గోలేటి లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సివిల్ ఎస్ఈ బాషా

కోల్ ఇండియా స్థాయి క్రీడల్లో సత్తా చాటాలి

రెబ్బెన, సెప్టెంబర్ 28: బెల్లంపల్లి ఏరియాలోని క్రీడాకారులు కోల్ ఇండియా స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని బెల్లంపల్లి ఏరియా సివిల్ ఎస్ఈ బాషా అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడమైదానంలో శనివారం వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 91వ వార్షిక క్రీడల్లో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ కిరణ్‌బాబు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, జూపాక రాజేశ్, తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 28 : చెన్నూర్ నియోజకవర్గంలో అన్ని రంగాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేకానందతో కలిసి జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సమష్టి కృషి చేయాలని, మిషన్ భగీరథ పథకంలో భాగంగా నియోజకవర్గంలోని నివాసాలకు నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం తాగునీరందించాలని, నీటి మోటార్ల సమస్యలను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని, దవాఖానల్లో మందుల నిలువలను అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో పార్కులు, మురుగు కాలువలు, అంతర్గత రహదారులు, పారిశుధ్యం, ఇతర వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలసత్వం లేకుండా రైతు రుణమాఫీ పూర్తి చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అంతర్గత రహదారుల పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని, సంబంధిత కాంట్రాక్టర్ల సమన్వయంతో పనులను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

జీవో నెంబర్25ను సవరించాలి

దండేపల్లి, సెప్టెంబర్28: జీవో నెంబర్ 25ను సవరించాలని కోరుతూ దండేపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మద్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని 1నుండి 10 తరగతులకు ఒక ఉపాధ్యాయుడు, 11 నుంచి 60 మందికి ఒక ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు జీవో నెంబర్25 ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయకుండా ఇక్కడే సర్దుబాటు చేస్తున్నదన్నారు.

అసమంజసమైన రేషనలైజేషన్ ఉత్తర్వులను సవరించాలి

ఆసిఫాబాద్‌టౌన్, సెప్టెంబర్ 28:అశాస్త్రీయమైన సర్దుబాటు కు సంబంధించిన జీవో నం. 25ను సవరించాలని, సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట నిరస తెలిపి జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ నాయకులు సోయం ఇందు రావు, జాదవ్ కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు హేమంత్ షిండే, రమేశ్, మాన్కు, సంజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రెబీస్ డే

దండేపల్లి, సెప్టెంబర్ 28: దండేపల్లి మండలంలోని రెబ్బెన్‌పెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ రెబీస్‌డేను నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్ విద్యార్థులకు రేబీస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. భీమారం, సెప్టెంబర్ 28: ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటి రేబిస్ టీకాలను పశువైద్యాధికారి డాక్టర్ రాకేశ్ శర్మ వేశారు. అనంతరం రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. మందమర్రి రూరల్, సెప్టెంబర్ 28: ప్రపంచ రేబిస్ వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు మందమర్రి ప్రాథమిక పశు వైద్య కేంద్రం వైద్యాధికారి కే తిరుపతి పేర్కొన్నారు. కుక్కలు, పిల్లులకు యాంటి రేబిస్ టీకాలు వేశారు. యాంటి రేబిస్ టీకా శాస్త్రవేత్త లూయి పాశ్చర్ వర్ధంతిని పురస్కరించుకొని రేబిస్ డే నిర్వహిసున్నట్లు తెలిపారు.

కామాంధుడిని శిక్షించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 28: బాలికపై లైంగికదాడికి పాల్పడ్డ కామాంధుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆసిఫాబాద్ మండలం బూరుగూడ వద్ద జాతీయ రహదారిపై విద్యార్థులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. బూరుగూడ జడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలికపై అదే గ్రామానికి చెందిన బొమ్మెన సాగర్ శుక్రవారం లైంగికదాడికి పాల్పడగా, విద్యార్థులు, గ్రామస్తుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. డ్రైవర్ సాగర్ గతం లో కూడా ఇద్దరు మహిళలపై లైం గికదాడికి యత్నించాడని, అతడి వైఖరి వల్ల భార్య సైతం వదిలేసి వెళ్లిందని, మద్యం మత్తులో ఉంటూ నిత్యం భయభ్రాంతులకు గురిచేస్తుంటాడని, అతడిని కఠినంగా శిక్షించాలని గంటన్నర పాటు ధర్నా నిర్వహించారు. ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోగా, ఆసిఫాబాద్ పట్టణ సీఐ సతీశ్ అక్కడికి చేరుకొని నిందితుడిని చట్టప్రకారం శిక్ష పడేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ సతీశ్

మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలి

ఆసిఫాబాద్ టౌన్,సెప్టెంబర్ 28: గురుకులాల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్, ఔట్ సోర్సింగ్, గెస్ట్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేసి, 12 నెలల వేతనం అమలు చేయాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం గ్లాట రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పరి సత్యనారాయణ అన్నారు. గురుకులాల సమస్యలపై టీఎస్‌యూటీఎఫ్, గురుకులాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా బాధ్యులు గణేశ్, ఉపాధ్యాయులు నరేశ్, సుధాకర్, వెంకటేశం, వాసు, సంతోష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉప్పరి సత్యనారాయణ

తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీపై నిరసన

మందమర్రి, సెప్టెంబర్ 28: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ ప్రసాదం తయారీలో ఆలయ కమిటీ దుశ్చర్యలను ఖండిస్తూ శనివారం మందమర్రి పట్టణంలో హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిరసన పాదయాత్ర నిర్వహించారు. అంగడిబజార్ ఏరియాలోని శివకేశవ ఆలయం నుంచి యాపల్ రామాలయం నుంచి పాతబస్టాండ్ చౌరస్తా వరకు పాదయాత్ర చేశారు. పాతబస్టాండ్‌లో శ్రీవెంకటేశ్వర స్వామి చిత్ర పటానికి పంచామృతాభిషేకం, ప్రాయశ్చిత్త యంత్ర పటనం చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ కమిటీ నాయకులు బండారు సూరిబాబు, కొంగల తిరుపతి రెడ్డి, బోరిగం వెంకటేశ్, రాచర్ల రవికుమార్, రాచర్ల గణేశ్, పూజారులు అనంతాచార్యులు పాల్గొన్నారు.

కార్మికుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 28 : జైపూర్ పవర్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడు మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్